క్లుప్తంగా

ఆర్డీఓ బాలకృష్ణ బాధ్యతల స్వీకారం



నందిగామ టౌన్: నందిగామ ఆర్డీఓగా బాలకృష్ణ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఆర్డీఓగా విధులు నిర్వహించిన రవీంద్రరావు బదిలీకాగా, ఆస్థానంలో సీఎంవో నుంచి బాలకృష్ణ ఇక్కడికి వచ్చారు. బాధ్యతలు చేపట్టిన బాలకృష్ణను పలువురు తహసీల్దార్లు, కార్యాలయ సిబ్బంది కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ విధి నిర్వహణలో రెవెన్యూ సిబ్బంది అలసత్వం వహిస్తే సహించేదని పేర్కొన్నారు. సబ్‌డివిజన్ పరిధిలోని ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ముగిసిన సంపూర్ణత అభియాన్ సదస్సు



పెనుగంచిప్రోలు: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గురువారం ఆస్పిరేషన్ బ్లాక్ ప్రోగ్రామ్ కింద నిర్వహిస్తున్న సంపూర్ణతా అభియాన్ సదస్సు గురువారం ముగిసింది. ఎంపీడీఓ సాయిహర్ష,సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, ఏబీపీ కోఆర్డినేటర్ మోహన్ సందీప్, వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, ఏఓ సిద్దారెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



కంచికచర్ల: కంచికచర్ల అరుంధతీనగర్‌కు చెందిన శతాధిక వృద్ధురాలు, విశ్రాంత టీచర్ యద్దనపూడి మాణిక్యమ్మ(100) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఆమె మృతదేహాన్ని పలువురు ఉద్యోగులు సందర్శించి నివాళులర్పించారు. ఆమె కుటుంబసభ్యులను పరామర్శించి, వారికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మాణిక్యమ్మ టీచర్‌గా ఎంతో మంది విద్యార్థులను ఉత్తమపౌరులుగా తీర్చిదిద్దారని కంచికచర్ల, వీరులపాడు మండలాల రిటైర్డ్ ఎంప్లాయిస్ సంఘ కార్యదర్శి ముండ్లపాటి పోతరాజు తెలిపారు.

రైతులకు అవగాహన

జగ్గయ్యపేట: వేపనూనె పిచికారి ద్వారా వరి పంటను ఆశించే దోమను నివారించవచ్చని జగ్గయ్యపేట మండల వ్యవసాయాధికారి వరలక్ష్మి సూచించారు.మండలంలోని అనుమంచిపల్లి, తక్కెళ్లపాడు గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత వ్యవసాయాధికారులు, కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్తలతో కలిసి క్షేత్రస్థాయిలో పంటపొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులను అవలంబించాలని కోరారు. అనంతరం పశువైద్యాధికారి మురళి మాట్లాడుతూ వ్యాక్సినేషన్, పశుగ్రాస పెంపకం, పశువులకు వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పశుపోషకులకు అవగాహన కల్పించారు. కేవీకే కోఆర్డినేటర్ కృష్ణంరాజు, శాస్త్రవేత్తలు శివప్రసాద్, రాజశేఖర్, రైతులు పాల్గొన్నారు.

ఉత్సవ కమిటీ నియామకం



నందిగామ టౌన్: అంబారుపేట గ్రామంలో వేంచేసియున్న సత్యమ్మ అమ్మవారి ఆలయానికి దసరా మహోత్సవాలలో భాగంగా దేవదాయశాఖ ఆధ్వర్యంలో నియమించిన ఉత్సవ కమిటీ సభ్యులతో గురువారం ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు. మంచాల మాధవరావు, చుండు శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, వీరమ్మ, పార్వతీ, సత్యనారాయణ, కాంతారావు, రాజారావు, అమరయ్యలను కమిటీ సభ్యులుగా ప్రమాణస్వీకారం చేశారు. ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని వారు తెలిపారు.

16మంది జూదరుల అరెస్ట్

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని చిల్లకల్లు రోడ్ ఎస్‌జీఎస్ కాలేజీ సమీపంలోని పాత లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు గురువారం తెల్లవారుజామున దాడిచేశారు. ఈ దాడిలో రూ 44,110 నగదును స్వాధీనం చేసుకోవడంతోపాటు 16మంది జూదరులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

సచివాలయాల తనిఖీ

జగ్గయ్యపేట అర్బన్: సచివాలయ ఉద్యోగులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర సూచించారు. స్థానిక ఎస్ఎస్‌పీ కాలనీలో ఉన్న 13,14వ సచివాలయాలను గురువారం ఆయన అకస్మికంగా చైర్మన్ రాఘవేంద్ర తనిఖీ చేశారు. ఆయా పనులపై సచివాలయాలకు వచ్చే ప్రజలకు ఇబ్బంది లేకుండా వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్ పేరం సైదేశ్వరరావు, నకిరికంటి వెంకట్, నాయకులు పూసల పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.



కంచికచర్ల వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేకాలంకరణలో అమ్మవారు



పేట వెండి దేవాలయంలో శ్రీబాలాత్రిపుర సుందరీదేవి అలంకరణలో అమ్మవారు



పేట దుర్గాపురంలో శ్రీరజిత కవచాలంకృత దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు



వత్సవాయి మండలం మక్కపేట అయ్యప్ప ఆలయంలో అమ్మవారు



కంచికచర్ల పశువుల ఆసుపత్రి రోడ్డులో పూజలు చేస్తున్న భక్తులు

శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

జగ్గయ్యపేట అర్బన్: దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని జగ్గయ్యపేటలోని ఆలయాల్లో గురువారం శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక నకాశిబజారులో వేంచేసియున్న శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో వేదపండితుడు మహంకాళి రామప్ప ఆధ్వర్యంలో కలశస్థాపన, అనంతరం శ్రీచండి మూలమంత్ర సహిత రుద్రహోమం, కుంకుమార్చన అత్యంత వైభవంగా నిర్వహించారు. అమ్మవారు శ్రీబాలాత్రిపురసుందరీదేవి అలంకరణలో దర్శనమివ్వగా, భక్తులు పూజలు చేశారు. . అద్దాలబజారు శ్రీమహాలక్ష్మి అమ్మవారి వెండి దేవాలయంలో జొన్నాభట్ల కిషోర్‌శర్మ ఆధ్వర్యంలో, దుర్గాపురం శ్రీదుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు చింతా శివరామశర్మ ఆధ్వర్యంలో అమ్మవార్లకు కుంకుమపూజలు, చండీ హోమం నిర్వహించారు. చెరువుబజారులోని శ్రీరేణుకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శ్రీసోమవంశ సహస్రార్జున క్షత్రియ(ఖత్రి) సమాజ్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. అద్దాలబజారు శ్రీకన్యకాపరమేశ్వరి, ఆనందసాయి ఆలయంలో అమ్మవారు శ్రీబాలాత్రిపుర సుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అధికసంఖ్యలో భక్తులు ఆలయాలను సందర్శించి అమ్మవార్లకు పూజలు చేశారు. స్థానిక బతుకమ్మ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శ్రీవరదరాజస్వామి వారి ఆలయంలో బతుకమ్మ వేడుకలను నిర్వహించారు.

పెనుగంచిప్రోలు మండలంలో..

పెనుగంచిప్రోలు: దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. పెనుగంచిప్రోలు శ్రీతిరుపతమ్మ అమ్మవారి ఆలయంలో పూజా కార్యక్రమాలతో ఉత్సవాలను ప్రారంభించారు. ప్రత్యేకంగా మండపంపై శ్రీకనదుర్గమ్మ అమ్మవారిని అలంకరించి కుంకుమ పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు దంపతులు, ఈఓ బీహెచ్‌వీఎస్ఎన్ కిషోర్ కుమార్, ఏఈఓ తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు. అదేవిధంగా తూర్పు బజారులో శ్రీదుర్గా మల్లేశ్వర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నవరాత్రుల పందిరిలో అమ్మవారిని భక్తులు విశేషంగా దర్శించుకున్నారు. శ్రీస్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయంతోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లోనూ భక్తులు నవరాత్రుల ఉత్సవాలు ప్రారంభించారు.



ముక్త్యాలలో బాలత్రిపుర సుందరీదేవి అలంకారంలో భవాని అమ్మవారు

జగ్గయ్యపేట మండలంలో..

జగ్గయ్యపేట: మండలంలోని ఆయాగ్రామాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆయా ఆలయాలు, ప్రధాన కూడళ్లలోని పందిళ్లలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాలకు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ముక్త్యాలలో వేంచేసియున్న భవానీ ముక్తేశ్వరస్వామి వారి ఆలయంలోని భవానీ అమ్మవారు బాలా త్రిపుర సుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈవో సురేష్‌బాబు పర్యవేక్షణలో అర్చకులు వారణాసి సాంబశివరావు, తూమాటి లక్ష్మీనరసింహాచార్యులు, ప్రేమ్‌కుమార్ శర్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కుంకుమ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వత్సవాయి మండలంలో..

వత్సవాయి: దేవీ శరన్నవరాత్రులు వత్సవాయి మండలంలో గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వత్సవాయి, దబ్బాకుపల్లి, మక్కపేట, చిట్టేల, భీమవరం, గోపినేనిపాలెం, మంగొల్లు, కంభంపాడు తదితర గ్రామాల్లో అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు చేశారు. అమ్మవారి మండపాల వద్ద మహిళలు సాయంత్రం వేళ రంగురంగులను పేర్చి అందంగా బతుకమ్మలను తయారుచేసి ఆడిపాడారు. మండపాల వద్ద ఎటువంటి ఘర్షణలకు తావులేకుండా నిర్వాహకులు తగిన చర్యలు తీసుకోవాలని ఎస్ఐ పి.ఉమామహేశ్వరరావు సూచించారు.



పూజల్లో పాల్గొన్న అమ్మవారి ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ఈఓ కిషోర్‌కుమార్ తదితరులు

నందిగామ మండలంలో..

నందిగామ టౌన్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నందిగామ పట్టణం, మండల గ్రామాల్లో గురువారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. అంబారుపేటలో వేంచేసియున్న సత్యమ్మ అమ్మవారు రజతకవచాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం ఈవో హరిగోపీనాద్ పర్యవేక్షణలో అష్టోత్తర సహస్రనామ పుష్పార్చనలు, ఖడ్గమాల, చండీ సహిత రుద్రహోమం, కుంకుమార్చన పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. పట్టణంలోని రామలింగేశ్వరస్వామిఆలయంలోని శుకశ్యామలాంబ అమ్మవారు, పల్లగిరి గట్టుపైనున్న త్రిశక్తి పీఠంలో వేంచేసియున్న కనకదుర్గ, కనకమహాలక్ష్మి, జ్ఞాన సరస్వతీ అమ్మవార్లు బాలాత్రిపురసుందరీదేవిగా దర్శనమిచ్చారు.

ఆలయాల్లో ఎమ్మెల్యే సౌమ్య పూజలు ..

దేవీ శరన్నవరాత్రి సందర్భంగా నందిగామ పట్టణంలోని పలు ఆలయాల్లో ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య గురువారం ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆమెను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. అదే విధంగా 16వ వార్డులోని కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలోనూ ఎమ్మెల్యే పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

కంచికచర్ల మండలంలో..

కంచికచర్ల : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో కనకదుర్గాదేవి అమ్మవారికి గురువారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద ఎస్ఐ బోనగిరి రాజు ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు చేశారు. పోలీసులు ఆయుధపూజ చేసి ఆయుధాలను పురవీధుల్లో ఊరేగించారు. స్థానిక వాసవికన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో రజిత కవచ అలంకారంతో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక పశువుల ఆసుపత్రి రోడ్డు, ఫైర్‌స్టేషన్ రోడ్డులో అమ్మవారికి చలవ మండపాలు ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో దుర్గాదేవి అమ్మవారికి మహాన్యాస పూర్వక అభిషేకాలు, నీరాజన మంత్ర పుష్పములు, అష్టోత్తర పూజలు కుంకుమార్చనలతో విశేష పూజలు చేశారు.

వీరులపాడు మండలంలో..

వీరులపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని వెల్లంకిలో ఏర్పాటు చేసిన అమ్మవారు బాలాత్రిపురసుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గూడెంమాధవరంలో సర్పంచ్ బండి సునీత ఆధ్వర్యంలో బతుకమ్మకు మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళలు బతుకమ్మ ఆడారు.



నందిగామలో రజతకవచాలంకారంలో దర్శనమిస్తున్న శుకశ్యామలాంబ అమ్మవారు



మంగొల్లు శివాలయం వద్ద అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



పేటలో బతుకమ్మకు పూజలు చేస్తున్న భక్తులు



కంచికచర్లలో ఆయుధాలకు ఊరేగింపు నిర్వహిస్తున్న ఎస్ఐ బోనగిరి రాజు, పోలీసులు



కంచికచర్ల ఫైర్‌స్టేషన్ రోడ్డులో కుంకుమార్చనలు చేస్తున్న భక్తులు



పెనుగంచిప్రోలు తూర్పుబజారులో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహ ఊరేగింపులో భక్తులు



పేట నకాశిబజారులోని శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో హోమంలో పాల్గొన్న భక్తులు



కంచికచర్ల పోలీస్‌స్టేషన్ వద్ద అమ్మవారిని ఊరేగిస్తున్న పోలీసులు

రైతులందరికీ పరిహారం ఇవ్వాలని డిమాండ్

పెనుగంచిప్రోలు: వరదల కారణంగా నష్టపోయిన రైతులందరికీ రాష్ట్రప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందించాలని వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, సర్పంచ్ వేల్పుల పద్మకుమారితోపాటు ఆయా గ్రామాల ఎంపీటీసీ, సర్పంచ్‌లు డిమాండ్ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వందలాది ఎకరాల పంటపొలాల్లో మేట వేసిన ఇసుకను తొలగించేందుకు ఎకరాకి రూ.60వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చు అవుతున్నందున ప్రభుత్వం రైతులకు పరిహారం అందజేసి ఆదుకోవాలని కోరారు. ఈ విషయంపై ఏఓ కె.రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఇసుక మేట వేసిన పొలాలపై ప్రభుత్వానికి ఇప్పటికే నివేదిక అందజేసినట్లు తెలిపారు. అనిగండ్లపాడులో వరదలకు 200ఇళ్ల వరకు దెబ్బతిన్నాయని, వస్తువులు పాడయ్యాయని ఎంపీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి సమావేశం దృష్టికి తెచ్చారు.

బదిలీపై వెళ్తున్న అధికారులకు సన్మానం..

బదిలీపై వెళ్తున్న ఎంపీడీఓ సాయిహర్ష, ఈవోపీఆర్డీ ప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ సాయి, గ్రామ కార్యదర్శులు సీహెచ్ వీరభద్రరావు, ఏడుకొండలు, శైలజలను అధికారులతోపాటు ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా నెడ్‌క్యాప్ మాజీ చైర్మన్ వేల్పుల రవికుమార్ మాట్లాడుతూ వరదల సమయంలో ఎంపీడీఓ, ఈవోపీఆర్డీ ఎంతో సేవ చేశారని కొనియాడారు. హౌసింగ్ ఏఈ చిదంబరేశ్వరరావు, ఏపీఓ తిరుపతయ్య, ఎంఈవో డి.రవీంద్ర, వైద్యాధికారి పి.ఇందిర, పీఆర్ ఏఈ సుందరరామయ్య, పశువైద్యాధికారి పి.అనిల్, కో–ఆప్షన్ సభ్యులు సయ్యద్ జాన్‌మియా, ఏఓ సిద్దారెడ్డి, ఇరిగేషన్ ఏఈ లక్ష్మి పాల్గొన్నారు.



ఈవోపీఆర్డీ ప్రసాద్‌ను సత్కరిస్తున్న సర్పంచ్ పద్మకుమారి, రవికుమార్, వాసు

పరిహారం అందించడంలో ప్రభుత్వం విఫలం

జగ్గయ్యపేట: ఇటీవల కురిసిన భారీ వర్షాలు వరదల కారణంగా నియోజవర్గంలో నష్టపోయిన పంట నష్టపరిహారం అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి డివి కృష్ణ విమర్శించారు. మండలంలోని రెడ్డినాయక తండా, బుధవాడ గ్రామాల్లో పార్టీ నాయకులు, రైతులతో కలిసి గురువారం ఆయన దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు.ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ భారీ వరదల కారణంగా పాలేరు, మునేరు ఉపనదులు ఉధృతంగా వరద ప్రవహించడంతో తీవ్ర పంట నష్టం వాటిల్లిందన్నారు. నష్టపోయిన పంటలను అధికారులు తూతూమంత్రంగా సర్వే చేశారన్నారు. కోట్లాది రూపాయల పంటనష్టం జరిగితే స్థానిక ప్రజా ప్రతినిధితోపాటు అధికారులు పర్యటించి, బాధితులకు ఎటువంటి సాయం అందించలేదన్నారు. ఇకనైనా బాధిత రైతులను ప్రభుత్వం పూర్తిగా ఆదుకోవాలని, లేకపోతే పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎస్కెహెచ్ శ్రీనివాస్. రావెళ్ల శేషు దాసరి నాగేశ్వరరావు బాలు నాయక్ లింగారావు దంత వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



పొలాలను పరిశీలించిన అనంతరం రైతులతో మాట్లాడుతున్న డి.వి.కృష్ణ, నాయకులు

ఈకేవైసీ నమోదు గడువు పొడిగింపు

జగ్గయ్యపేట: డివిజన్‌లోని జగ్గయ్యపేట, వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాల్లోని రైతులు సాగు చేసిన పంటలకు ఈనెల ఏడోతేదీలోగా ఈకేవైసీ చేయించుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీఏ భవానీ గురువారం తెలిపారు. గడువును ఏడోతేదీ వరకు పొడిగించినట్లు వివరించారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామాల్లోని రైతుసేవా కేంద్రం, గ్రామ, మండల వ్యవసాయాధికారులను సంప్రదించాలని ఏడీఏ సూచించారు.

కారు ధ్వంసం

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో బుధవారం కురిసిన గాలివానకు చెరువుబజారు ఆంజనేయస్వామి ఆలయ సమీపంలోని కాలనీలో చెట్టు కూలిపడటంతో సూరబోయిన ఆదాం అనేవ్యక్తికి చెందిన కారు ధ్వంసమైంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, చినబాబు కారుని పరిశీలించారు. బాధితుడికి ధైర్యం చెప్పారు.

న్యాయవాదుల విధులు బహిష్కరణ

జగ్గయ్యపేట అర్బన్: బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా న్యాయవాదుల చట్టంలో మార్పులకు పాల్పడటాన్ని నిరశిస్తూ జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాగ సుందరరావు ఆధ్వర్యంలో న్యాయవాదులు గురువారం కోర్టు విధులను బహిష్కరించి నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చర్యలు న్యాయవాదులను కించపరిచేలా ఉన్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో న్యాయవాదులు బత్తుల వెంకట్రామయ్య, కరణం నరసింహారావు, పసుపులేటి సత్యశ్రీనివాసరావు, వై.ధనుంజయుడు, జూనెబోయిన శ్రీనివాసరావు, బూడిద నరసింహారావు, ఎం.కృష్ణయ్య, ఎం.ఆంజనేయులు, కె.శ్రీనివాసరావు, పూల నాగరాజు, రావూరి ప్రసాద్, జి.శ్రీనివాసగౌడ్, డి.హనుమంతరావు, శ్రీధర్, శ్రీనివాసవి, శేషకుమారి, అమ్ములు తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభల నిర్వహణ

కంచికచర్ల: జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా అభివృద్ధి పనులు చేపట్టేందుకు మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో సర్పంచుల అధ్యక్షతన గురువారం గ్రామసభలు నిర్వహించారు. ఏపీఓ రమాదేవి మాట్లాడుతూ గ్రామాల్లో డొంక రోడ్ల అభివృద్ధి, డ్రెయినేజీ తదితర పనులను గుర్తించినట్లు వివరించారు. గండేపల్లిలో నిర్వహించిన గ్రామసభలో సర్పంచి బొక్కా రవికుమార్, టెక్నికల్ అసిస్టెంట్లు నక్కా నాగేశ్వరరావు, సువర్ణరాజు, ఈసీ నిషార్‌వలి, కార్యదర్శి జిల్లేపల్లి రత్నాకర్ ఎఫ్ఏ బి.మోహన్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నూతన బస్సు సర్వీసులు ప్రారంభం

జగ్గయ్యపేట అర్బన్: ప్రయాణికుల సౌకర్యార్థం జగ్గయ్యపేట నుంచి విజయవాడకు నూతనంగా పలు సర్వీసులను ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) తెలిపారు. జగ్గయ్యపేట నుంచి విజయవాడకు ఏర్పాటు చేసిన మూడు ఎక్స్‌ప్రెస్ బస్ సర్వీసులను ఎమ్మెల్యే తాతయ్య గురువారం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఆర్టీసీ అభివృద్ధికి కృషిచేస్తూ, ప్రయాణికులకు నాణ్యమైన సేవలను అందిస్తోందన్నారు. సుదూర ప్రాంత సర్వీసుల స్థానంలో నూతన బస్సు సర్వీసులను ఏర్పాటు చేయాలని డిపో అధికారులను కోరారు. బస్‌స్టేషన్ ఆవరణను ఎల్లవేళలా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, ఏఎంసీ మాజీ చైర్మన్ కట్టా నరసింహారావు, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కర్రి చిన్నా, కౌన్సిలర్లు సంగెపు బుజ్జిబాబు, పేరం సైదేశ్వరరావు, వెంకట్రావు, నాయకులు పూసల పుల్లారావు, బొబ్బిళ్లపాటి ప్రసాద్, ముత్యాల శేషగిరి, గింజుపల్లి కృష్ణ, ఆర్టీసీ డిపో మేనేజర్ రఘురాం, అసిస్టెంట్ మేనేజర్ రజని, డిపో సూపరిండింటెంట్ బి.నాగేశ్వరరావు, పారిశ్రామికవేత్తలు, హైర్ బస్‌ల ఓనర్లు, ఆర్టీసీ యూనియన్ల నాయకులు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.



పేటలో నూతన ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తాతయ్య తదితరులు